

# క్రొత్త సంస్కృతి

పూర్వాషాఢ

డబ్బున్న ప్రతివాడికీ ఏదో ఒక కార్యక్రమంఅంటూ లేకపోతే మరీ అయోమయంగా వున్నట్లనిపిస్తుంది.

మధుసూదనరావు క్రొత్తగా బి.ఎల్. ప్యాసై బోర్డుకట్టి యింకా మూణ్ణెలయినా గడపలేదుకాని? దూరపు బంధువులెవరో హఠాత్తుగా కాలం చేయడంతో లక్షలు ఖరీదుచేసే ఆస్తిపుటుకు వచ్చిపడింది.

ఇప్పుడు తను అద్దెకుంటున్న ఇంటినే కొనేసెయ్యవచ్చు కాని కొంటే అట్లు బస్తీ ఇటు పల్లెటూరు కాని ఆ ప్రదేశంలో పలుగురూ నానా విధాలుగాను అనుకుంటారని ఆ ప్రయత్నం కాస్తా విరమించుకున్నాడు. నిజానికి తనకిప్పుడున్న ఐశ్వర్యానికి ఓ చిన్నకారు, లేడీ సెక్రటరీ. నాలుగయిదు క్లబ్బుల్లో గౌరవాధ్యక్షపదవో లేకపోతే కార్యదర్శి పదవో ఏదో ఒకటి నిర్వహించలేడనా? నిర్వహించవచ్చు. చెయ్యడానికే లక్షపనులున్నాయి. కోలెడన్ని ఊహలు అతని మనసులో పడిగుళ్లు తిరుగుతున్నాయి కాని చేద్దామంటే వాటిల్లోకి ఎట్లా ప్రవేశించాలో అనుభవంలేని కారణాన అట్లా వుండిపోయాడు. ఈ మాటనే క్లబ్బులో నలుగురితోటి చెప్తే-

"డబ్బున్నవాడివి 'ఎన్‌జాయ్'చేయక దేశసేవమీద, కీర్తి ప్రతిష్ఠలమీద నీ కెందుకయ్యా అంత మోజు" అన్నాడు పద్మనాభం బార్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంటు.

"చూడు నెత్తిన కానీ పెడితే దమ్మిడీ ఖరీదు చేయని నాలాంటివాడికో లేకపోతే కళ్ళుమూసుకొని రెండుచేతులా దానం చేసినా తరగని ఆస్తికల రాక్‌ఫెల్లర్ లాటివాడికో యిటువంటి పనులు తగును కాని నిజంచెప్తున్నాను నీలాంటివాడికి యిట్లా మనసు పోవడం, నీకూ, దేశానికీ మంచిది కాదనమా!" అని హెచ్చరించాడు యూత్ అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు చక్రధరరావు.

ఏదీ వీల్లేకపోతే కనీసం ఏ థోయర్స్ అసోసియేషన్‌లో నయినా ఛాన్సు దొరికితే బాగుండుననుకున్నాను అదీ కనపడలేదు.

బస్‌స్టాండుదాటి పది గజాలు నడిచాడోలేదో "సార్....సార్" అన్న మాటలు వినపడ్డాయి. మధుసూదనరావుకి "సార్"అని పిలవడమే అలవాటయింది కాని వాకళ్ళచేత పిలిపించుకోవడం అలవాటు లేకపోవడంచేత ఉలిక్కిపడి వెనక్కి తిరిగి చూశాడు. ఐదుగురు ఆడపిల్లలు వరసాగ్గా నిలబడివున్నారు. అందరి మొహాల్లోను నవ్వులు. అందరి చేతుల్లోను డబ్బాలూ వున్నాయి. వాళ్ళ చేతుల గాజులు కదలినప్పుడల్లా వాళ్ల డబ్బాల్లో డబ్బులుగలగలమంటున్నాయి

అందులో ఎర్రగా, పొడుగ్గావున్న అమ్మాయి అతని చేతికో కరపత్రం అందించింది. అందులో రాజకీయ పార్టీ నాయకుడు ఆ అమ్మాయిల తలిదండ్రులు ఎక్కడో నెల్లూరులో అగ్నిప్రమాదంలో చనిపోయారని అంచేత ఎవరికి తోచిన విధంగా వారికి సహాయం చేయాలని వారి పక్షాన అభ్యర్థిస్తూ వ్రాయబడివుంది. మధుసూదనానికి అనుకోకుండా అనిపించింది "పోనీ యిటువంటివాళ్లనందర్నీ చేరదీసి ఓ అనాథాశ్రమం పెడితేనో" అని. మధు వాళ్లను తనతో రమ్మనమని ఓ ప్రక్కకు తీసికొని వెళ్లాడు.

"చూడండి! మీరు నాకు చెప్పలేక పోయినా కనీసం నే చెప్పేదయినా మీకు తెలుస్తుందా?" అని అడిగాడు.

వాళ్ళు తలలు అడ్డంగా వూపారు.

"ఇట్లా అడుక్కోకపోతే మా యింటికి వస్తారా?" ఆ అమ్మాయిలు ఏమీ మాట్లాడలేదు.

"ఏమిటీ! వస్తారా, లేదా?"

ప్రక్కనే పోతున్న పెద్దమనిషి వచ్చాడు. వయసులోవున్న ఐదుగురు ఆడపిల్లల్ని పట్టుకొని వస్తారా, లేదా అంటూ మరో పెద్దమనిషి అడగడం ఆయనకి తమాషా అనిపించి దిక్కాబోలు.

మళ్ళీ మధుసూదనరావు అడిగాడు "ఏమిటీ? నేను చెప్తున్నది అర్థం అవుతున్నదా? ఇహ మీకు అడుక్కోవలసిన పని వుండదు మీకు ఏలోపమూ రాకుండా చూస్తాను నాతోపాటు రాకూడదూ?"

ఆ పెద్దమనిషి నవ్వుతూ అన్నాడు మధుతోటి "భలేవాడివయ్యా అయిదుగుర్ని రమ్మంటావేమిటి? పక్కసారి అయినా దబ్బిస్తే...."

మధు కళ్ళు చింతనిప్పు లయ్యాయి "ముక్కు మొహం తెలియని మనిషి తనను యింత అవమానం చెయ్యదమా?" ఆ పెద్దమనిషితోటి తిరిగి కోపంతో "అయ్యా! మీరెవరో నాకు తెలియదు. నేను వీళ్ళందరితోటి ఓసంఘం పెడదామనుకుంటున్నాను. అంతే కాని నాకు మరేదురుద్దేశమూ లేదు. మీరు చాలా అవమానకరంగా మాట్లాడారు."

ఆ పెద్దమనిషి పరమ ప్రశాంతంగా జవాబిచ్చాడు. "పెట్టుకో నాయనా! నేనూ అదే చెప్తున్నాను. వొక్కొక్కళ్ళతోటి ప్రారంభించు నీ సంఘాన్ని. నఇగుర్ని వొకేసారి తీసికెళ్ళితే వాళ్ళు నీ మెడకు గుదిబండల్లాగా తయారయితే అప్పుడు బాధపడతావు అందుకని."

మధుకి యీరకం ప్రస్తావన కొనసాగించడం ఇష్టంలేదు. "థాంక్సు మీ సలహాకి" అని అంటూ వెనక్కితిరిగాడు.

ఆ అమ్మాయిలు అప్పుడే మకొకర్ని వెతుక్కుంటూ పోతున్నారు. ఆచూపులు ఆ చేతులు, ఆ చాతలు మనమన్సుల్లో రకరకాల అభిప్రాయాలకు రంగులు మారడానికి దోహదం యిస్తున్నాయి.

మధు చూడలేక, అక్కడ వుండనూ లేక యింటికి వచ్చేశాడు.

ఇల్లంతా బావురుమంటున్నది. కాసేపు రేడియో పెట్టుకున్నాడు. వొంటరితనంలో ఆ సంగీతమూ బాధగానే వుంది. అది సహించలేక వాకిట్లోకి వచ్చాడు. హైస్కూలు విద్యార్థులెవరో వికృతంగా మాట్లాడుకుంటూ తమ అశ్లీలాలకు తామే ఆనందించుకుంటూ ముందుకు పోతున్నారు! నందుమొగదులో కొందరు యువకులు చుట్టా, బీడీ కాల్చుకుంటూ తమలోతాము ఆనందిస్తున్నారు.

"దేశంలో మానవశక్తి వృథాఅయి పోతున్నది. వీళ్ళందరి తెలివితేటలను దేశానికి వుపయోగపడేటట్లు చేయాలి" అనుకున్నాడు మధు.

వాళ్ళందరులేచి, మధు వాకిట్లోకి రావడంచూసి అతన్ని నమీపించారు.

"ఏమన్నా పనుందా బాబూ!" అంటూ అడిగారు మధుని.

మధు అనుకోకుండానే జవాబిచ్చాడు ఇట్లా మమ్మల్ని.... మమ్మల్ని పట్టుకొని ప్రేలాపకపోతే ప్రభుత్వానికి అర్జీలు పెట్టుకోరాదూ! దేశంలో కావలసినన్ని వుద్యోగాలుంటే."

"మేము మొన్నటిదాకా ఇక్కడ పనిచేసినవాళ్ళమే బాబూ! ప్రాజక్టు పని ఆగిపోతే యిట్లా రావల్సివచ్చింది. రెక్కాడితే గాని డొక్కాడనివాళ్ళం.

ఉన్న బాబులు కనికరించవలె. ఏదైన పని చూపించవలె" అన్నాడు ఆ పల్లెలు లోను పెద్దవాడుగా కనిపిస్తున్నవాడు, బక్కచిక్కి వున్నవాడు బారెడు గడ్డం వున్నవాడు.

మధు వాడివైపు చూశాడు. వాడి బరువు కళ్లలో దీనత్వం ఆకలి బాధ, జీవన తాపత్రయం నగ్ననృత్యం చేస్తున్నాయి. మధు తనవైపు చూచుకున్నాడు. టెర్లిన్ పాంటు, టెర్లిన్ షర్టు షర్టుజేబులోంచి బయటకు కనిపించీ కనిపించని గోల్డ్ ఫ్లేక్ సిగరెట్ ప్యాకెట్టు పార్కరు పెన్ను—ఆశ్చర్యంవేసిందతనికి

"ఈ సృష్టిలో యింతటి అనంతములైన భేదాలా — ఇది వొక భయంకరమైన మాట. వేదాంతులు కనిపెట్టింది. పాపం, ఖర్మ. పూర్వజన్మ యిత్యాది పదజాలంలో మానవుడి సర్వ ధములైన చేతనా సామగ్రినీ బంధించేశారు ఉక్కుచిక్కాలమధ్య.

"ఊ ! యింతకీ ఏమేం పన్లు చేయగలవు నువ్వు ?"

"నేను చేయలేనిపని లేమున్నాయ్ బాబయ్యా ! మొక్కలకు నీళ్ళు పెట్టగలను, గొడ్లను మేతకు బయటకు తోలుకెళ్ళగలను, అదీకాదంటే అంట్లూ. చెంబులూ తోమగలను. నేను వొకటి కాదు లక్ష అవతారాలెత్తాను; ఇంకా ఎత్తగలనుకూడా — పోనీ మీరు చెప్పండి ఈపని నువుచెయ్ నర్సింలూ అని. అప్పుడు చూడండి నర్సింలు జబ్బల్లో యింకా ఎంతకండ వుందో."

అంతలో నవ్వటానికేం లేకపోయినా మిగిలినవాళ్లంతా ఎందుకో పగలబడి నవ్వారు. మధు కా నవ్వులు నచ్చలేదు, ఆ నవ్వులేకాదు—యీ ప్రపంచపు పద్ధతులే కొన్ని నచ్చినవికాదు. కాని ఏం చేయడం? ఎక్కడికక్కడే సరిపెట్టుకోవడం జీవనధర్మంగా కనిపిస్తున్నది.

"సరేలే మాటలకేంగాని దొడ్లో కొబ్బరిచెట్లు కనుపిస్తున్నాయా? వాటికి గోతులు త్రవ్వి. చుట్టూ పాదుచేసి, మువ్వల్లో యింత వుప్పు పెట్టండి. గడ్డీ, గాదమూ బాగుచేయండి."

"సిత్తం దొరా."

అందులో పుటపిల్లలా వున్న ఓకుర్రవాడున్న ఆమాట వింటూనే పార, పలుగు తీసుకొని దొడ్లోకి పరుగెత్తాడు.

పదుములువంచి పని చేస్తున్నవాళ్ళ వైపుచూస్తూ మధు కొంచంసేపు వరండాలో నిలబడ్డాడు. దూరంగా దేవుడిగుళ్లో వాయిస్తున్న సన్నాయి స్వరం, తీతువు పిట్ట వికృతంగా వేస్తున్న కేకతో కలసి హృదయాన్ని సంచలింపచేస్తోంది.

"ఇంకా శారద రాలేదేమిటి చెప్మా? మధు బజారులోకివచ్చి చూశాడు, వీధి అంతా కోలాహలంగా వున్నా, తను ఏకాకిగా వున్నానన్న భావం కలుగుతోంది.

"ఏమయ్యా! యిటు చూడండి. మీరు పనిచేస్తూండండి. ఇప్పుడే వస్తాను" అంటూ ఆ వీధి చివరిదాకా వచ్చాడు చివరగావున్న హోటల్లోంచి గుబాళింపు వాసనలతో కలసి వినవస్తున్న మనుష్యుల మోటుకంఠాలు ...

అక్కడవుండలేక కావలసినవికొనుక్కొని వెనక్కి తిరిగాడు. ఎదురుగ్గా ప్రకాశం పిలచాడు చిన్ననాటి స్నేహితుడు.

"ఏమిట్రా! నీకెంతో ఆస్తి కలిసింది కదూ! నాకు వుత్తరమైనా వ్రాయలేదేం?"

మధుకి నిజానికి చిరాకు వేసింది.

"ఆస్తి ఆస్తి, ఆస్తి-ఈ ఆస్తిగొడవలూ, ధనదాహం వీటిని విడిచి మనుష్యులు బ్రతకలేరా? ఆవేశాలు ఎందుకుగాని ఎక్కడిన్నుంచి వస్తున్నావురా ప్రకాశం రా....యింటికి వెళదాం" అన్నాడు మధు.

"ఇప్పుడు రానుగాని, నీ దగ్గర ఓ అయిదు రూపాయలుంటే యివ్వరా మళ్లీ యిస్తాను."

"మళ్ళీ యిస్తాను" అన్న మాటకు అర్థం మరుజన్మలోనే అని అనుభవపూర్వకంగా తెలుసుకున్న మధు అనుకోకుండా అనేశాడు

"అట్నే కాదురా. నెలాఖరు కదూ! అందుకని" అని తిరిగి "అవునురా డబ్బు మనిషిని అంత వెధవని చేస్తుంది. లక్షలకు ఆస్తిని తెచ్చుకున్నావుగాని,దానికి తగిన హోదా రమ్మంటే ఎలా వస్తుందిరా నీకు" అన్నాడు.

"మాటలన్నీ అనేసి విన, వినా నడిచిపోయాడు. మధు మనసు కలుక్కుమంది. నిజం చెప్పినా అర్థంచేసుకోలేని ప్రపంచం, తన వునికిని గమనించని ప్రపంచం ఎల్లా బ్రతకడం యిక్కడ?

మధు యింటికి వచ్చాడు. ఇల్లంతా నిశ్శబ్దంగా వుంది. చీకటి. పనిచేస్తున్న వాళ్ళు కన్పించడంలేదు. పాదులు సగం త్రవ్వి విడిచిపెట్టినట్లుగా లీలగా కనిపిస్తున్నాయి. తను బయటకు వెళ్లినప్పుడు వాకిట్లో నాలుగయిదు పేముకుర్చీలు వుండాలి. ఏవి అవి? మధు మొహం కళావిహీనమయింది.

శారద చంటిపిల్లను చంకను వేసుకొని మెల్లగా వచ్చింది

"అదేమిటండీ! వాకిట్లోనిలబడ్డారు?"

మధు మాట్లాడకుండా లోనికినడిచాడు.

మధు మనసు నీరయింది. జరిగింది చెప్పాడు భార్యకు. శారద కాపరానికి వచ్చినపుడు తను ముచ్చటపడి తెచ్చిన పట్టెమంచం ఏమయింది విడమర్చి చెప్పాడు బాధగా.

శారద భర్తవైపు చూసింది.

"ఇంత పిచ్చివాళ్ళేమండి? ఈ లోకంలో మంచితనమూ, మనిషి సామర్థ్యమూ ఎవరికి కావాలి? మూలపడి వున్న పెత్తనాన్ని తగుదునమ్మా అని బుజాన వేసుకొని వీధిలోకి బయలుదేరితే జనం మీవెంటపడి వస్తుంది ఒకరిని మీరు నమ్మితే వెంటనే యింటి వాసాలు లెక్కించడానికి ప్రయత్నిస్తాడు వాడు. నిరంతరంగా జరిగిపోతున్న వంచనాయజ్ఞం యిది. దీనికి మీరుకూడా ఒకసమిధను ఎందుకో ఆహుతి యిచ్చారు.

మధుదగ్గర ఈ ప్రశ్నకు సమాధానం లేదు. చివురు తొడగని క్రొత్త సంస్కృతికి ప్రతినిధి మధు. కొన్నికోట్లమంది యువకుల్లో ఈ ప్రశ్నకు సమాధానం లేనప్పుడు మధుదగ్గరమటుకు ఎందుకుంటుంది?

మధు మెల్లగా శారద వడిలో తల పెట్టి పడుకున్నాడు.

పసిపిల్లవాడిని అక్కున చేర్చుకున్న ఆ చేతితోనే శారద మధుసూదనరావుకి ధైర్యాన్నికూడా యిస్తున్నది, సేద తీరుస్తున్నది. ★